

# హిందూ గృహిణి

పానుగంటి లక్ష్మీనరసింహారావు

వారు తెలినాటి నియోగులు వారినే గోలకొండ నేపారులందరు వారు నూతనముగా వైష్ణవ మత స్వీకరణ మొనర్చినవారు మిగుల వృద్ధులు భర్తకు డెబ్బదియైదు వత్సరములు భార్య కఱువది తొమ్మిది వారు పరమ దరిద్రులు వారి కొక్క పుత్రుడు అతని కేఁబది వత్సరము లుండెను అతనికిఁ బుత్ర పుత్రికా సంతాన మేమియులేదు భార్యయందు బద్ధానురాగుఁడై వర్తించుచుండెను నలువది రెండు సంవత్సరములు దాటిన పిదప నామె గర్భము ధరించెను కాక గర్భవతియైన కాంతయందాకాంతున కెంత యనురాగముండెనో యాతనికే తెలియఁదగినది నేటికిఁ బౌత్రదర్శనమగును గదా యని, వృద్ధ దంపతులుప్పొంగిపోయిరి. కోడలికిఁ బ్రసవవేదన యారంభమయ్యెను కొడుకు గలుగునని వారు సంతసించుచుండగాఁ గూఁతురు జన్మించెను దైవకటాక్షమున నిఁక ముందుఁ బుత్త్రుడు కలుగఁగూడదాయని వారు త్తలపడుచున్న చిత్తములను సమాధానపఱచుకొనిరి పుట్టిన మూఁడవ నాఁడాబిడ్డ చనిపోయెను ఆఱవనాఁడు సూతికా జ్వరమున బాలెంతరాలు తన తనువు విడిచెను సంసారవృద్ధి కాలేదని వారిదివఱ కేడ్చుచుండఁగా నిప్పుడిట్లయ్యెను ఆహా భగవదనుగ్రహము!

అన్నము తినక, నీరైన ద్రావక, సంతత భార్యా దుఃఖ సంతప్తుఁడై, యామెపోయిన మూఁడవమాసమున భర్తకూడఁ బోయెను అయ్యో! ఇఁక నేమున్నది మనుమరాలులేదు కోడలులేదు ఉన్న యొక్క కొడుకుకూఁ నెగిరి పోయెను. అయ్యో! ఇంక నేమున్నది? కొడుకా కొడుకా యని యేడ్చుచున్న వృద్ధదంపతులు మాత్రము మిగిలిరి ఏగియో వైదిక వృతి చేసికొని దినమున కొక్కరూపాయ తెచ్చి కుటుంబమునకు క్షామబాధ లేకుండఁ గాపాడుచున్న యొక్క కొడుకుగూడ మన్నయినాఁడు ఓ భగవానుడా! ఆ కుటుంబము గతి యింకనేమి?

ఏమగుట కేమున్నది డెబ్బదియైదు వత్సరముల యా యపుత్త్రకుఁడు నడుమున కంగవస్త్రమును జుట్టఁబెట్టుకొని కఱ్ఱ చేతఁబట్టుకొని యింటిలోనున్న నిలువుబోడి రాగిచెంబును జేతబుచ్చుకొని గ్రామమున భిక్షాటన మారంభించెను నాలుగిండ్లు తిరిగి తవ్వెడు నూకలు తేఁగఁ బుత్రశోకముచేఁ బొగులుచున్న గృహిణి యింత గంజికాచుచుండెను అది యొక్కపూట ద్రావి కృష్ణనామస్మరణ మొనర్చుకొనుచు దాటాకుల పంచపాళిలోఁ బడి వారు కాలముఁ గడుపుచుండిరి

ఇట్లొక్కమాసము గడవకుండానే, యాయనకు వ్యాధి యారంభమయ్యెను ఆతఁ డీతాకుఁ జాఁపపైఁ బండుకొని జ్వరపీడితుఁడై బాధపడుచుండ, భార్య కాళు లొత్తుచుఁ బైఁటచెఱఁగున నీఁగలను దోలుచుఁ దలనొత్తుచు నడుమ నడుమ గన్నులొత్తుకొనుచు దైవసముఁడగు భర్తకుపచారము చేయుచుండెను. డెబ్బది యైదేండ్లవాఁడు ఆఱుముగ్గినపండు జ్వరపీడితుఁడై యున్న నేమి? లంఘనము కట్టవచ్చునా? ఏదైనా? గంజి త్రాగుట కీయవలయును గాదా లేకున్నఁ బ్రాణములు శోషిల్లవా వృద్ధులకు బాలురకు శోషవచ్చుట యెంతో సేపా లేచి ప్రొయ్యిమంట వేసి, బియ్యము కొరకు రాగిచెంబు చూడఁగ దానిలో నొక్క బియ్యపుగింజయైన లేదు హా! కృష్ణ యని నాలుగిండ్లకుఁ బోయి పిడికెడు చొప్పున నాలుగు పిడికిళ్ల బియ్యము పైటలోఁబోసి తెచ్చి గంజి కాచి యిచ్చి, భర్తపైఁ జేయి వైచుకొని యెట్లున్నది, యెట్లున్నదని నడుమ నడుమ నడుగుచు, నప్పుడప్పు డాతనికిఁ బోసిన చెమ్మటను బైఁట చెఱఁగున నిమ్మళముగా నొత్తుచు, నిలువేల్పులకు మ్రొక్కుకొనుచు భర్త ప్రక్కను గూరుచుండి యాతని సేవించుచుండెను ఇఁకను రెండు పిడికళ్ల బియ్య మింటిలో నున్నవి అవి వండుకొని తాను భుజించినయెడల రాత్రి భర్త

# హిందూ గృహిణి...

కిచ్చుటకు వేడిగంజి మెదుకులుండవని యామె భుజింపక యూరకుండెను భర్తకుఁ జెమ్మట బాగుగాఁబట్టుచున్నది జ్వరము వదలుచున్నదని భార్య సంతసించెను కాని యాతని మాటలో యేటఁబడుచున్నది అప్పుడు భార్యను జూచి యాతడిట్లనియెను

భర్త — నాకు నీరసమెక్కువగా నున్నది తనువు నిల్చునని తోఁపదు నేను నీతో నొక్క మాటఁ జెప్పవలయునని యున్నది చెప్పనా ?

భార్య నాథా! ఇట్లు నన్నడగ వలయునా — ఏమి యాజ్ఞాపింతురో చేతులు కట్టుకొని చేయుదును

భర్త — నేనింక బ్రదుకను

భార్య — మీ రట్లనఁదగదు నాకుఁ బుణ్యస్త్రీ మరణమున్నదని నే నెఱుఁగుదును

భర్త — కావచ్చును నీవు నన్నేఁబది యైదు సంవత్సరములనుండి సేవించుచుంటివి నా కీకోరిక యున్నదని నిన్నెప్పుడైనా నడిగితినా? నీవు నాకుఁ జేసిన యుపచారమునకు దేవతలు మెచ్చఁదగినది నా కిప్పుడొక్క కోర్కె కలిగినది నేను శక్తి హీనుఁడనై యున్నాను అది నీవు తీర్పవలయును

భార్య —ఎన్నండులేని దిట్లడుగుదురేల ? మీ యాజ్ఞ యేదో సెలవిందు

భర్త — అటులైనఁ జెప్పెదను వినుము మన యింటిలో నిల్వరాగిచెంబున్నదే — ఆ చెంబెడు బియ్యము చెంబుతోఁగూడ రెండురూపాయలు దక్షిణతోఁగూడ నొక శ్రీ వైష్ణవునికి దానమీయవలయునని యున్నది అది నా కెట్లు నమకూడునా యని యోజించుచున్నాను

భార్య — ఇంతేకద — ఒక్క గడియలో మీరట్లు సేయవచ్చును

అంత వేగమ లేచి క్రొత్తదారపు బొందు నకుఁ బసపురాచి, గూటిలో నున్న పసపుకొమ్ము దాని నడుమను గట్టి మెడకుఁ గట్టికొని పుస్తె లున్న బొందును విప్పి వాని నూడఁదీసి రాగిచెంబు చేత పుచ్చుకొని, కోమటి యింటికిఁబోయి పుస్తెల నమ్మఁబూనెను కోమటి అయిదు రూపాయల నిచ్చెదనని చెప్పెను "చాలు నాయనా" యని యాసొమ్ము తీసికొని రాగి చెంబునిండ బియ్యము పోయించి దాని విలువను గోమటికిచ్చి సంభ్రమముతో ఇంటికివచ్చుచు దారిలోఁ గానఁబడిన యొక శ్రీవైష్ణవుని వెంటఁబెట్టుకుని తన యింటికిఁబోయెను భర్తయా దానమొనర్చెను 'నీ పుణ్యమున నా కోర్కె తీరినదని యాతఁడు సంతుష్టమనస్కుఁ డయ్యెను కాని యాతనికిఁ నీరస మెక్కువగా నున్నది. 'నారాయణ నారాయణ'యని స్మరించు కొనుచుఁ బండుకొనెను భార్య యాతని పాదముల యొద్దఁ గూరుచుండి వానిని గన్నుల కద్దుకొనుచుండెను ఆమెను పిలిచి నెను లోపల నారాయణా యని స్మరించుకొనుచునే యున్నాను ఎప్పుడు విస్మృతివచ్చునో—నీవు కూడ నా చెవిలో నారాయణస్మరణము చేయు చుండుమనెను అంత భార్య భర్త తల వైపున గూర్చుండి యట్లొనర్చు చుండెను ఒక్క నిముసమట్లా చరించునంతలో నాతని కొక్క యెక్కులాగున వచ్చెను కాళ్లుచేతులు బిగిసెను ఒడలు మొద్దు లాగున నయ్యెను ఊపిరి స్తంభించెను. ఆమె 'కృష్ణ! కృష్ణ!' యని వెఱ్ఱికేక వైచి కొయ్యయై కూరుచున్న పాళముగనే ముందునకుఁ బడిపోయెను ఆమె మొగ మాతని మొగముపై బడుట వలననో యామె వెఱ్ఱికేక మూలముననో యాతఁడులికిపడెను ఎక్కుగూడ ఎదలిపోయెను కొంత స్మృతి తెచ్చుకొని భార్యను బిలిచెను ఇంక నెక్కడి భార్య ? ఆమె మహాలక్ష్మి సన్నిధానమును నిముసము క్రిందనే చేరెను భర్త నారాయణ యనుచు బ్రాణములు విడిచెను ●

**ఆంధ్రపత్రిక 1920 అక్టోబరు 13**



బాపు కార్ట్యూనులు - 19

ప్రౌఢ వాక్యాల తెరల మరుగున... తొణికిసలాడే...
ముగ్ధ భావాలతో—
పన్నెలాడీలా... కన్నెలేడీలా... వయ్యారాలు పోయే...
తేనె తేటల... తెలుగు మాటల... రంగుల పొంగులతో—
తెలుగువాడి జీవిత జీమూతాన్ని ఒత్తిగించి... తెల్లని...
చల్లని... చక్కని... చిక్కని... కథాశరచ్చంద్రికలు
వెలయించి—
మదుముగుంపెల గుబగుబలాడించి మనసు కందని
అందాలను భాషకు ఒంచి—
బ్రతుకులలో... కైతలలో... బయస్కోపు స్కోపులలో...
అచ్చర లచ్చల పచ్చి చమత్కారాలు పండించుకుంటూ—
అలనాటి పాండురంగ విభుని పదగుంభనలా
పొంచిబహూరు దర్బారులో నిలచి—....
ఎవరన్నా మహానుభావులు ?
ఓహో! రచన రచనకు మెప్పు!
సాహో! రామకృష్ణ శాస్త్రి!!

**ఆంధ్ర సచిత్ర వార పత్రిక 1962 ఫిబ్రవరి 2 సంచిక నుంచి**

*Printed and Published by S. Nageswara Rao at The Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.*